ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

సనత్‌నగర్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ వేడుకలను శనివారం ఆ పార్టీ శ్రేణులు వాడ వాడలా నిర్వహించాయి. పలుచోట్ల పార్టీ జెండాలను ఎగరవేశారు. అలాగే పార్టీ అధిష్టానం పిలుపు మేరకు సనత్‌నగర్‌లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోలింగ్ బూత్‌లకు చెందిన నేతలు సమావేశమై బీజేపీ మరింత పటిష్టతపై సమాలోచనలు చేశారు.ఈ కార్యక్రమంలో దయానంద్, లక్ష్మీనారాయణ, చంద్రకుమార్, నరేష్, వరప్రసాద్, శ్రీనివాస్, గోపి, మృదుల్, కార్తీక్ వారణాసి, అశోక్, మాధవి, మల్లయ్య పాల్గొన్నారు.

- సనత్‌నగర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్ ఆధ్వర్యంలో బీకేగూడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లింగంపల్లి నర్సింగరావు హాజరై పార్టీ జెండా ఎగరవేశారు.

'బీజేపీ గెలుపు ఖాయం'

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని డివిజన్‌లోని పోలింగ్ బూత్ నెం. 165 వద్ద టిఫిన్ బైఠక్‌లో పాల్గొని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ.. ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రధానిగా మోదీ, అదే విధంగా సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి కూడా గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సాయదత్తు, నేతి సత్యనారాయణ, సత్యనారాయణ, ప్రశాంత్, సతీష్, రమేష్, శ్రీనివాస్, సునీత, మనీషా, కిషోర్, రాహుల్ పాల్గొన్నారు.



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

బీజేపీ బలోపేతానికి కృషిచేస్తా



బీజేపీలో చేరిన కేఎం క్రిష్ణ

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీకి చెందిన సీనియర్ నాయకులు కేఎం క్రిష్ణ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. గతంలో కేఎం క్రిష్ణ బీజేపీలో చాలా కాలం పని చేసి నాటి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.తాజాగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పని అయిపోయిందని 10 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్‌ఎస్ ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కేంద్రంలో తిరిగి నరేంద్ర మోడీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కేఎం క్రిష్ణ మాట్లాడుతూ.. తిరిగి బీజేపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాయకుల ఆదేశాలతో మరింత ఉత్సాహంగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ సుందర్ గౌడ్, రాజశేఖరరెడ్డి, సురేష్, ఎస్.వై. గిరి పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు వినతి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రభుత్వం జారీ చేసిన వివిధ ఉద్యోగాలను సాధించేందుకు లైబ్రరీలో చదువుతున్నామని..కానీ ఇక్కడ వసతులు సరైన సరిగా లేవని వెంటనే సౌకర్యాలు కల్పించాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు విద్యార్థులు వినతి పత్రం సమర్పించారు. శనివారం ఓయూ లైబ్రరీని సందర్శించేందుకు వెళ్లిన రిజిస్ట్రార్‌కు ఏఐఎస్‌ఎఫ్, రీసెర్చ్ స్కాలర్స్ సమస్యలను వివరించారు. విద్యార్థులకు కూర్చునేందుకు కుర్చీలు లేవని ఖాళీగా ఉన్న గదుల్లో కుర్చీలు టేబుల్స్ ఏర్పాటు చేయాలని, తాగునీటి సౌకర్యం కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు, మరుగుదొడ్ల నుంచి దుర్వాసన రాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు నెల్లి సత్య, లక్ష్మణ్, సోమనాథ్, సుమన్, అశ్విన్ ఉన్నారు.

అసెంబ్లీ ఎన్నికల విజయం స్ఫూర్తితో పనిచేయండి

- నగరంలో ఒక ఎమ్మెల్యే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో తెలియదు
- సికింద్రాబాద్ ఎంపీ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్



మాట్లాడుతున్న పద్మారావుగౌడ్, పక్కనే ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన అభ్యర్థులందరినీ గెలిపించారని, అదే స్ఫూర్తితో తన విజయానికి కృషి చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఆయనకు మద్దతుగా మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో శనివారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో కేవలం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిథ్యం వహించే నియోజకవర్గాలే కాకుండా ఇతర పార్టీల నుంచి గెలిచిన వారి నియోజకవర్గాల అభివృద్ధికి సైతం నిధులు కేటాయించారని గుర్తు చేశారు. నగరానికి చెందిన ఒక ఎమ్మెల్యే ఎప్పుడు ఏ పార్టీలో ఉంటాడో ఎవరికీ తెలియదని దానం నాగేందర్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరతాడన్నారు. హైదరాబాద్ నగరంలో బలమైన శక్తిగా బీఆర్‌ఎస్ పార్టీ ఉందన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్‌ఎస్ కైవసం చేసుకోవడం ద్వారా కేంద్ర కేబినెట్ మంత్రిని ఓడించిన చరిత్ర మనకే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ చెప్పిన పథకాలను అమలుచేయకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామన్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు కన్నా ప్రతిపక్షంలో ఇంకా బాగా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కరెంట్, మంచినీటి ఇబ్బందులు చాలా ఉన్నాయన్నారు. ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలుచేయడం లేదని ఈ విషయమై ప్రజలు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారన్నారు. కేసీఆర్ జిల్లాల పర్యటనలకు వెళ్లినప్పుడు రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం కోపాన్ని వెళ్లగక్కుతున్నారన్నారు. పద్మారావు గెలుపు కోసం అందరం కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, అరుణగౌడ్, కిరణ్మయి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, హనుమంతరావు, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను ఓడిస్తాం'

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో అధిక జనాభాగల మాదిగలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఇటుక శ్రీకిషన్ మాదిగ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటోన్మెంట్‌లో ప్రధాన రాజకీయ పార్టీలు మాదిగల పట్ల వివక్ష చూపుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఉప ఎన్నికల్లో మాదిగలకు టికెట్ ఇవ్వాల్సిందిగా తాము అన్ని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చామన్నారు. ఈ డిమాండ్‌ను విస్మరించి, మాల సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే కాంగ్రెస్ టికెట్ ప్రకటించడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగలు ఓటు వేయొద్దని పిలుపునిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇటుక గోపి, అజిత్ కళ్యాన్, దర్గ రవి మాదిగ, ఉప్పులేటి రాజేందర్ మాదిగ పాల్గొన్నారు.

టీఎస్‌సెట్ మెంబర్ సెక్రెటరీగా ప్రొ.నరేష్ రెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ: స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ సెట్) మెంబర్ సెక్రెటరీగా ఓయూ కామర్స్ విభాగం అధ్యాపకులు ప్రొ.నరేష్‌రెడ్డి నియమితులయ్యారు. యూనివర్సిటీ క్యాంపస్ కామర్స్ కాలేజీలో 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం సాధించిన ఆయన 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. కామర్స్ అధ్యాపకునిగా 17 ఏళ్లుగా బోధిస్తున్న ప్రొ.నరేష్‌రెడ్డి వద్ద 15 మంది విద్యార్థులు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీలు, 2 పీడీఎఫ్ (పోస్టు డాక్టరల్) పట్టాలను అందుకున్నారు. ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అడిషనల్ కంట్రోలర్, ఎస్‌ఎస్‌ఎస్ ఆఫీసర్, ఎంబీఏ, కామర్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ పదవులను చేపట్టిన ఆయన ప్రస్తుతం టీఎస్‌సెట్ కోఆర్డినేటర్‌గా పదవిలో కొనసాగుతున్నారు. టీఎస్‌సెట్-2024 నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

లీకేజీలు అరికడతాం.. స్వచ్ఛమైన నీరందిస్తాం

- కలుషిత జలాల నివారణకు చర్యలు
- నిరంతరం నీటి పరీక్షలు
- నీటిని పొదుపుగా వాడాలి
- సాక్షితో జలమండలి మేనేజర్ కృష్ణప్రసాద్



కలుషిత జలాల నివారణకు జలమండలి అధ్వర్యంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే లాలాపేట జలమండలి పరిధిలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో నల్లా ద్వారా సరఫరా అయ్యే నీటిలో క్లోరిన్ శాతం ఎంత మేరకు ఉంది అనే నిర్ధారణ పరీక్షలు చేస్తూ స్థానికులకు స్వచ్ఛమైన తాగునీటిపై అవగాహన కల్పిస్తున్నారు. లాలాపేట జలమండలి పరిధిలో లాలాపేట, శాంతినగర్, లక్ష్మీనగర్, లాలాగూడ, లిల్లీ మోడల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో మొత్తం దాదాపు 6 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఈ వేసవిలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా జలమండలి తీసుకుంటున్న చర్యలపై మేనేజర్ కృష్ణప్రసాద్‌తో సాక్షితో వెల్లడించారు. -లాలాపేట

సాక్షి: లాలాపేట ప్రాంత ప్రజలకు ఈ వేసవిలో నీటి కొరత ఉండే అవకాశం ఉందా?

మేనేజర్: వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి రాకుండా తాగునీటి సరఫరాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నీటి వృథాను అరికట్టేందుకు లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం. లాలాపేట పరిధిలోని ప్రజలకు నీటి కొరత లేదు. పుష్కలమైన నీటి వనరులు ఉన్నాయి.

సాక్షి: కలుషిత జలాల సమస్య, ప్రెషర్ సమస్య నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేనేజర్: కలుషిత నీటి సమస్య గుర్తింపు కోసం నల్లా నీరు సరఫరా అయ్యే ప్రాంతంలో ర్యాండంగా నీటి పరీక్షలు చేస్తున్నాం. క్లోరిన్ శాతం నిర్ధారణ పరీక్షలు చేస్తూ స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేస్తున్నాం. పైపు లైన్లు లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపడుతున్నాం.

సాక్షి: నీటి వృథాను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేనేజర్: ప్రస్తుతం బెంగళూరు లాంటి పట్టణంలో తాగునీటి కొరత వేధిస్తుంది. అలాంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో రాకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నీరు వృథా చేసే వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నాం. అవసరమైతే వారి నల్లా కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరిస్తున్నాం. వాహనాలు, ఫ్లోరింగ్‌లు కడగడం వేసవి ముగిసే వరకు తగ్గించాలని ప్రజలకు సూచిస్తున్నాం.

సాక్షి: నీటి వనరుల సంరక్షణకు ప్రజలకు ఏం చెప్తారు?

మేనేజర్: సర్వమానవాళి మనగడుకు నీరే జీవనాధారం. కావునా నీటి వనరులను వృథా చేయకుండా పొదుపుగా వాడాలి. ప్రతి ఇంటి వద్ద స్థలం ఉంటే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి. దీనిపై తమ ప్రాంతంలో అపార్టుమెంట్‌లు, కాలనీలు, బస్తీలో ఇంకుడు గుంతలను పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తున్నాం.



క్లోరిన్ పరీక్షలు చేస్తున్న జలమండలి సిబ్బంది(ఫైల్)

సాయిబాబాకు సన్మానం



నాగులూరి సాయిబాబాను సన్మానిస్తున్న చర్చి ప్రతినిధులు

చిలకలగూడ: సామాజిక సేవకుడు, సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయ ట్రస్టీ నాగులూరి సాయిబాబాకు చిలకలగూడ సీఎస్‌ఐ వెస్లీ చర్చి ప్రతినిధులు శనివారం పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. చర్చి నిర్మాణంతోపాటు పలు సందర్భాల్లో సాయిబాబా తండ్రి దివంగత నాగులూరి మేడ్చల్ నర్సింహా పలు విధాల సహాయ సహకారాలు అందించారని, అదే రీతిని కొనసాగిస్తూ అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్న నాగులూరి సాయిబాబాకు కృతజ్ఞతలు తెలిపారు. చిలకలగూడ సీఎస్‌ఐ వెస్లీ చర్చి ప్రెస్ బైటర్ ఇన్‌చార్జీ రెవరెండ్ డాక్టర్ ప్రసన్నకుమార్, స్టీవార్డ్ విల్సన్, ప్రోపర్టీ సెక్రటరీ జేపీ సుధాకర్, సీనియర్ లీడర్ డాక్టర్ జోనవిన్సెంట్ పాల్గొన్నారు.

లాడ్జిలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అమీర్‌పేట: లాడ్జిలో ఉరేసుకుని ఓ బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎస్‌ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కోట బొమ్మాళి మండలం, పొన్నన్‌పేటకు చెందిన పి.భుజంగరావు (29) గతంలో కుత్బుల్లాపూర్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేసేవాడు. అక్కడే పనిచేసే ఓ మహిళా ఉద్యోగికి ప్రపోజ్ చేశాడు.అందుకు యువతి నిరాకరించడంతో పాటు ఈ-మెయిల్ ద్వారా బ్యాంకు అధికారులకు ఫిర్యాదు చేసింది.దీంతో భుజంగరావును మందలించి ఎస్‌ఆర్‌నగర్ శాఖకు బదిలీ చేశారు. ఐడీపీఎల్ జీడిమెట్ల, షాపూర్‌నగర్ హెచ్‌ఎంటీ సొసైటీలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఎస్‌ఆర్‌నగర్‌లో బ్రాంచీకి ఇచ్చేవాడు.ఈ నెల 4న అమీర్‌పేట శివబాగ్ కాలనీలోని గోకుల్ ఓయో గ్రాండ్ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు.మరొనటి రోజు సాయంత్రం అవుతున్నా భుజంగరావు గదిలో నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది మారుతాళం చెవితో గది తలుపులు తెరిచి లోపలికి వెళ్లి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపి శ్రీకాకుళంలో ఉండే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. భుజంరావు ఆత్మహత్యకు ముందు తాను ప్రపోజ్ చేసిన యువతి, బ్యాంకు అధికారులతో పాటు సిబ్బంది పేర్లతో ఓ లేఖ రాసినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

అమీర్‌పేట: ఇంటర్వ్యూకు వెళ్లి వస్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొని ఓ యువతికి తీవ్ర గాయాలైన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు వివరాల ప్రకారం .. నెల్లూరుకు చెందిన ప్రశాంతి (24) ఏడాది క్రితం ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చింది.అమీర్‌పేట శివబాగ్‌లోని హాస్టల్‌లో ఉంటున్న ఆమె శనివారం ఉదయం ఎస్‌ఆర్‌నగర్‌లోని ఓ సంస్థ కార్యాయానికి ఇంటర్వ్యూకు వెళ్లింది.తిరిగి హాస్టల్‌కు బయలుదేరిన ఆమె ఐసీఐసీఐ బ్యాంకు వద్ద రోడ్డు దాటుతుండగా అమీర్‌పేట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు యువతిని ఢీకొట్టడంతో ఎడమ కాలు విరిగి తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకులను అదుపులోకి తీసుకున్నారు.

ఆకట్టుకుంటున్న హునర్ మహోత్సవ్



డైరెక్టర్ దీపక్ శుక్ల



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఏర్పాటు చేసిన హునర్ మహోత్సవ్-2024 ఎగ్జిబిషన్ ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది. గత వారం రోజులుగా కొనసాగుతున్న హస్తకళా ప్రదర్శనకు జంటనగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి తరలివస్తున్నారని డైరెక్టర్ దీపక్ శుక్ల పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల హస్తకళాకారులు రూపొందించిన కళాఖండాలు, వస్త్రాలు, లక్క గాజులు, జనపనారా, తోలు వస్తువులు ఈ ప్రదర్శనలో లభ్యమవుతుండడంతో పాటు రంజాన్, ఉగాది సందర్భంగా షాపింగ్ చేసేందుకు ఈ ప్రదర్శన అనువుగా ఉండడంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ ప్రదర్శనలో ఢిల్లీ, ముంబై, పంజాబ్, హైదరాబాద్ ఇతర రాష్ట్రాల పసందైన వంటకాలు, మ్యూజిక్ ప్రజలను విశేషంగా ఆకట్టుకోంటోంది. జంటనగరాల వాసులకు అందుబాటులో సికింద్రాబాద్ జింఖానా మైదానంలో హునర్ మహోత్సవ్ పేరిట హస్తకళాకారులకు చేయూతనందించేందుకు మహా ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామని దీపక్ శుక్ల పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కావడమే లక్ష్యంగా..



కంటోన్మెంట్: యువజన కాంగ్రెస్ నేతగా రాజకీయాల్లోకి వచ్చిన శ్రీగణేశ్ 2014 ఎన్నికల్లో కంటోన్మెంట్ కాంగ్రెస్ టికెట్ ఆశించినప్పటికీ దక్కలేదు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. తిరిగి 2019లో బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన.. 2023 ఎన్నికల్లోనూ ఆ పార్టీ టికెట్ దక్కకపోవడంతో మరోసారి బీజేపీలో చేరి టికెట్ దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో కంటోన్మెంట్ చరిత్రలోనే బీజేపీకి అత్యధిక ఓట్లు (41,888) ఓట్లు వచ్చాయి. గత నెలలో లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో, పార్లమెంట్ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ అసెంబ్లీకి ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

- ఈ క్రమంలో బీజేపీ నుంచి శ్రీగణేశ్ మళ్లీ పోటీకి సిద్ధమంటూ ప్రచారం కూడా ప్రారంభించారు. ఇంతలోనే కాంగ్రెస్ పార్టీ నుంచి పిలుపు రావడంతో గత నెల 19న ఆ పార్టీలో చేరారు. కాంగ్రెస్ బలంతో పాటు శ్రీగణేశ్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణతో ఉప ఎన్నికల్లో విజయం సునాయసమవుతుందని నేతలు భావిస్తున్నారు. 2014 నుంచీ కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ వచ్చిన తనకు ఎట్టకేలకు అధిష్టానం అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని శ్రీగణేశ్ అన్నారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలందరి సమన్వయంతో ఉప ఎన్నికల్లో గెలిచి పార్టీకి గిఫ్ట్‌గా ఇస్తానన్నారు. ప్రస్తుత అసెంబ్లీలో గ్రేటర్ పరిధిలో తొలి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

రసూల్‌పురా: ఇఫ్తార్ మత సామరస్యానికి ప్రతీక అని, రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కాంగ్రెస్ నాయకులు శ్రీ గణేష్ పేర్కొన్నారు. రసూల్‌పురా గన్‌బజార్‌లో శ్రీగణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ.. రంజాన్ హిందూ, ముస్లింల ఐక్యమత్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నసీర్ హుస్సేన్, జహంగీర్, సమీర్, టైసీన్ డిక్రోజ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో నివేదిత

రసూల్‌పురా: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం కార్ఖానాలో శనివారం జరిగిన ఇఫ్తార్ విందులో బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత ముఖ్య అతిథిగా హాజరై ముస్లిం సోదరులకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. ముస్లిం సోదరులు రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఆలీమ్, అఫ్రోజ్, ఆరీఫ్, కలీం, త్యాగరాజు, నిత్యానంద్, తాహిరాబేగం, ఫారుక్, సాయి, మురళి యాదవ్,జిత్తు, హుస్సేనీ, నజియా పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

బౌద్ధనగర్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్ వివరాల ప్రకారం.. పార్శిగుట్టలోని సంజీవ్‌పురానికి చెందిన మౌనికకు వరంగల్‌కు చెందిన కనకరాజు అనే వ్యక్తితో 2022లో వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో ఆరు నెలల క్రితం మౌనిక పార్శిగుట్టలోని తన పుట్టింటికి వచ్చింది.ఇంట్లో ఎవరు లేని సమయంలో బయటకు వెళ్లిన మౌనిక మళ్లీ తిరిగి రాలేదు. తండ్రి కొమురయ్య బంధువులకు ఫోన్ చేసి వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఇంటర్, పాఠశాల విద్యార్థులకు వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ కోర్సుల్లో నెల రోజుల శిక్షణకు 15 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నారు. నగరంలో వివిధ పాఠశాల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8.15 నిమిషాల నుంచి 9.45 వరకు తరగతులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ప్రొ.నవీన్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు నేటి నుంచి (7న) దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక భవనంపై నుంచి దూకి సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య చేసుకున్న ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..అడ్డగుట్టకు చెందిన నర్సింగ్‌రావు(43) సికింద్రాబాద్‌లోని సంగీత్ చౌరస్తా సమీపంలోని ఎన్‌సీఎల్ భవనంలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అయితే.. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి ఎన్‌సీఎల్ భవనంపై నుంచి దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని గాంధీ మార్చురీకి తరలించారు.

మహంకాళి ట్రాఫిక్ ఎస్ఐగా మల్లేష్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా మల్లేష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీధర్ అబిడ్స్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం నిర్మాణాత్మకమైన కార్యచరణతో ముందుకు సాగుతామన్నారు. రోడ్లపై అక్రమ వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాటు రోడ్లపై వచ్చి వ్యాపార కార్యకలాపాలను నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంట్లో దాచిపెట్టిన బంగారు ఆభరణాలు చోరీ

సనత్‌నగర్: ఇంట్లో దాచిపెట్టిన రూ.20 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బేగంపేటలోని మోతీలాల్‌నెహ్రూనగర్‌లో నివసించే ఫణి రాజ్యలక్ష్మి తాను ఇంట్లో దాచిన 30 తులాల బంగారు ఆభరణాలు కనిపించడం లేదని శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 30 తులాల ఆభరణాలు కలిగిన బాక్స్‌ను ఒక బుట్టలో ఉంచి పడక గదిలో దాచి పెట్టింది. ఆ ఆభరణాలను బ్యాంక్‌లోని లాకర్‌లో ఉంచడం కోసం 4వ తేదీన చూడగా కనిపించలేదు. ఇంట్లో రెండేళ్లుగా పనిచేస్తున్న పని మనిషి సునీతపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది.